RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | మంగళవారం | 02.07.2024

సంపుటి 321 | సంచిక 1 | పేజీలు : 04 | వెల : రూ.5



## మహిళలకు స్మార్ట్ కార్డులు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

మహాలక్ష్మి పేరుతో తెలంగాణలో మహిళలకు అందిస్తున్న ఉచిత బస్ ప్రయాణం మరింత సౌకర్యవంతంగా సాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. అందుకే దీన్ని మరింత సులభతరం చేసేందుకు ఆర్టీసీ ఆలోచన చేస్తోంది. ఉచిత ప్రయాణం లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. త్వరలోనే లబ్ధిదారులకు ఈ కార్డులను అం

..మిగతా 2 లో

# 292 కోట్ల మొక్కలు రూ. 12 వేల కోట్లు

- హరిత హారం పేరు మారుస్తూ కీలక నిర్ణయం
- హరిత హారం లెక్కలు తీస్తున్న సర్కార్
- హరిత హారం పథకంలో నిధుల దుర్వినియోగం
- నాటిన మొక్కలకి రెండింతలు నటినట్లుగా రికార్డుల్లో నమోదు

"తెలంగాణ ప్రభుత్వం హరితహారం పేరు మారుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏటా వర్షా కాల ఆరంభంలో చేపట్టే ఈ మొక్కలు నాటే కార్యక్రమం బీఆర్ఎస్ హయాంలో హరితహారంగా రూపాంతరం చెందింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పాత ఆనవాళ్లను తొలగించే ప్రక్రియలో భాగంగా ఈ పథకానికి ఒకప్పుడు ప్రారంభంలో పెట్టిన పేరునే కొనసాగించే ప్రక్రియ చేపట్టింది. 2015-16 నుంచి తొమ్మిది విడతలుగా చేపట్టిన 'తెలంగాణకు హరితహారం' పథకం కింద ఇప్పటి వరకు 292 కోట్ల మొక్కలు నాటినట్లు, రూ.11,747 కోట్ల ఖర్చు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్న నేపథ్యంలో వ్యయానికి అనుగుణంగా ఫలితాలు రాలేదనే అనుమానాలను సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రి వ్యక్తం చేసినట్లు సమాచారం.

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు హరితహారం పథకంలో నిధుల దుర్వినియోగం జరిగినట్టు భావిస్తున్నారు. నాటిన మొక్కలకు రెండిరతలు రికార్డుల్లో నమోదు చేయడం, ఆ తర్వాత ఆ మొక్కలు చనిపోయాయని పేర్కొంటూ మళ్లీ మొక్కలు నాటినట్లు చూపడం వంటివి జరిగాయని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నట్టు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా నిధుల దుర్వినియోగంపై కమిటీ వేద్దామని ఆమె ఈ సందర్భంగా ప్రతిపాదించినట్లు తెలిసింది. దీనికి సీఎం స్పందించి వందల కోట్ల మొక్కలు నాటినట్లు గణాంకాలున్నాయని, ఆ స్థాయిలో పచ్చదనం పెరగలేదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు వన మహోత్సవం పేరుతోనే పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించేవారు. 1950 లో ఈ కార్యక్రమం ప్రారంభం కాగా..ఈ సంవత్సరం 75 సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంలో తాజాగా ఈ కార్యక్రమానికి 'వజ్రోత్సవం వన మహోత్సవంగా నిర్వహించనుంది. పనిలో పనిగా గత పదేళ్లుగా మాజీ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కొంత మందికి హరిత ఆహారంగా మారింది. హరిత హారం కార్యక్రమంలో నిధులను కైంకర్యం చేసి మొక్కుబడిగా హరిత కార్యక్రమం నిర్వర్తించి అందినకాడికి నిదులు దోచుకున్నవారిపై కాంగ్రెస్ సర్కార్ నజర్ పెట్టనుంది. ఇందులో భాగంగా ఇప్పటికే కొన్ని అంశాల్లో కమిటీ వేసి విచారణ జరిపిస్తోంది. మరికొన్ని వాటిపై ప్రణాళికలు సిద్దం చేస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన హరిత హారం పథకంపై నూతన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ కార్యక్రమంలో నాటిన మొక్కలు, చేసిన ఖర్చు, నిధుల దుర్వినియోగం తదితర అంశాలపై సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు

..మిగతా 2 లో






## హైకోర్టులో కేసీఆర్‌కు ఎదురుదెబ్బ

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఎదురుదెబ్బ తగిలింది. కేసీఆర్ వేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ప్రభుత్వ వాదనలకు న్యాయస్థానం ఏకీభవించింది. విద్యుత్ అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్ విచారణపై కేసీఆర్ సవాల్ చేశారు. నేడు కేసీఆర్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వెలువరించింది. విద్యుత్ కొనుగోలు అవకతవకలపై జ్యుడిషియరీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషన్ విచారణను కేసీఆర్ సవాల్ చేశారు. ఇరువైపుల వాదనలూ విన్న న్యాయస్థానం ప్రభుత్వ వాదనలను సమర్థిస్తూ కేసీఆర్ పిటిషన్‌ను కొట్టేసింది.హైకోర్టులో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై మూడు రోజుల ముందే వాదనలు ముగిశాయి. అయితే ఆ రోజున హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. అసలు కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది. ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ సంఘాన్ని నియమించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని ఇవాళ హైకోర్టు కొట్టివేసింది.




## అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలు

- ఇక స్వదేశీ చట్టాలే

**న్యూఢిల్లీ ప్రభాత సూర్యుడు**

కొత్త క్రిమినల్ చట్టాలు అమల్లోకి వచ్చిన వేళ కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలకు ముగింపు పలికామని వెల్లడిరచారు. ఇప్పటి నుంచి స్వదేశీ చట్టాలే కొనసాగుతాయని స్పష్టం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తితోనే వీటిని రూపొందించినట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చాక ఇవి ఆదర్శంగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోని ఎన్నో వర్గాలకు న్యాయం జరిగే విధంగా వీటిని రూపొందించినట్టు వివరించారు. పాత చట్టాలు శిక్షలకే ప్రాధాన్యత ఇస్తే ఈ కొత్త చట్టాలు మాత్రం పూర్తిగా న్యాయం చేయడంపైనే దృష్టి పెడతాయని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేందుకు ఈ చట్టాలను రూపొందించారు. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ప్లేస్‌లో న్యాయ సంహిత, సాక్ష్యా అధినియమ్, నాగరిక్ సురక్షా సంహితను తీసుకురానున్నారు. బ్రిటిష్ కాలం చట్టాలకు ముగింపుపలికేలా కీలక మార్పులను కేంద్రం తీసుకొస్తోంది. జీరో ఎఫ్ఐఆర్‌తో పాటు ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచైనా పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. ఎస్ఎంఎస్ ద్వారా సమన్లు పంపడం, నేర సంఘటనలను తప్పనిసరి వీడియోగ్రఫీ చేయాలన్న నిబంధన తీసుకురానున్నారు. దాదాపు 163 ఏళ్లుగా ఉన్న చట్టాల స్థానంలో కొత్త చట్టాలు రాబోతున్నాయి. ఉగ్రవాదానికి సరైన నిర్వచనంతో పాటు రాజద్రోహం పదం తొలగించి.. న్యాయ సంహితలో దేశద్రోహం అనే కొత్త పదం చేర్చారు. ఈ సమాజంలో నేరాలను తొందరగా పరిష్కరించేందుకు మార్పులు ఉపయోగపడతాయని కేంద్రం చెబుతోంది. శిక్షలు విధించడం కంటే కూడా న్యాయం అందించడానికి ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుందని అంటున్నారు. అందరికీ న్యాయం అనే ఉద్దేశంతో కొత్త చట్టాలను పూర్తి సవరణలతో తీసుకొచ్చారు. బ్రిటిష్ కాలం చట్టాలను పక్కనపెట్టి కొత్త చట్టాలను భారతీయులే రూపొందించారు.ఏదైనా క్రిమినల్ కేసుల్లో విచారణ ముగిసిన 45 రోజుల్లో తీర్పు ఇవ్వాలి. 60 రోజులలోపు చార్జిషీట్ దాఖలు చేయాలని స్పష్టంగా పేర్కొన్నారు. లైంగిక దాడి బాధితుల స్టేట్‌మెంట్‌ను కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో మహిళా పోలీసు మాత్రమే రికార్డ్ చేయాలని చట్టం చేశారు. అలాగే బాధితురాలి వైద్య నివేదికలు 7 రోజుల్లో ఇవ్వాలని, పిల్లలను అమ్మడాన్ని, కొనడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నట్టు చట్టంలో పొందుపరిచారు. మైనర్‌పై గ్యాంగ్ రేప్ జరిగితే జీవిత ఖైదు

..మిగతా 2 లో

## నీట్ పై చర్చకు విపక్షాలు పట్టు

**న్యూ ఢిల్లీ - ప్రభాత సూర్యుడు**

లోక్ సభలో సోమవారం 'నీట్' రచ్చ కాక పుట్టించింది. నీట్ పై చర్చ జరపాలని విపక్షాలు పట్టుబట్టగా, స్పీకర్ దానికి అనుమతి ఇవ్వలేదు. దాంతో ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. నేడు లోక్ సభ ప్రారంభమయ్యాక రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చను అనురాగ్ ఠాకుర్ ప్రారంభించారు. సభ ప్రారంభమయ్యాక గందరగోళం చోటుచేసుకుంది. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ విషయంపై చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. ఎన్‌డిఏ వైఫల్యంపై చర్చించాలని కాంగ్రెస్ ఎంపీ వాయిదా తీర్మానం నోటీసు ఇచ్చారు. రాహుల్ గాంధీ మైక్ స్విచ్ ఆఫ్ పై స్పీకర్ ఓం బిర్లా వివరణ ఇచ్చారు. నీట్ పై ఒకరోజు చర్చకు అవకాశం ఇవ్వాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పీకర్‌ను కోరారు. కాగా నీట్ అంశంపై బిఎసిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ బిర్లా అన్నారు. నీట్ పై చర్చకు అనుమతించకపోవడంతో విపక్షాలు వాకౌట్ చేశాయి.



## ఎన్ని వేల కోట్లు అప్పులు ఉన్నాయో తెలియదు

- శాఖల్లో నిధులు లేవు
- పూర్తి స్థాయిలో పనిచేస్తా, జీతం వద్దు
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**కాకినాడ - ప్రభాత సూర్యుడు**

తాను పూర్తి జీతం తీసుకుని పని చేద్దామనుకున్నాని.. కానీ పంచాయతీ రాజ్ శాఖలో నిధుల్లేవు. ఎన్ని వేల కోట్ల అప్పులు ఉన్నాయో తెలియడం లేదని అందుకే జీతం వదిలేస్తున్నానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులో సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. పిఠాపురం ప్రజలకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలా అని అనుకున్నాను. ఈ విధంగా చెప్పినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. తాను తీసుకున్న శాఖలు చాలా కీలకమైనవని.,వాటిని అర్థం చేసుకోడానికి సమయం పట్టిందన్నారు. తక్కువ చెప్పి ఎక్కువ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా చెప్పారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తరువాత డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ తాను పోటీ చేసిన పిఠాపురం నియోజకవర్గానికి తొలిసారి వచ్చారు. జూలై 1 సందర్భంగా వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పెన్షన్ పంపిణీ చేసేందుకు పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు గ్రామానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు స్వయంగా తన చేతుల మీదుగా పెన్షన్ డబ్బులు రూ. 7 అందజేశారు. అనంతరం అక్కడి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు.అత్యంత వెనుకబడ్డ వాళ్ళు ఉన్నారంటే దివ్యంగులేనని గతంలో సీఎం చంద్రబాబు కూడా చెప్పారన్నారు. అందుకే వారికి ఈ ప్రభుత్వం పెన్షన్ పెంచిందని చెప్పారు. పంచాయితీ రాజ్ లెక్కలు చూస్తుంటే.. ఎటు వెళ్ళాయో అర్థం కావట్లేదని గతపాలకులకు చురకలు అంటించారు. రూ.600 కోట్లు ఖర్చు చేసి రుషికొండలో భవనాలు కట్టారని.. అదే డబ్బుతో ఎంతో అభివృద్ధి జరిగి ఉండేదని అన్నారు. ఇప్పుడు ఆ నిధులన్నీ బుడిదలో పోసిన పన్నీరు అయిందని విమర్శించారు. తన కార్యాలయంలోకి ఫర్నీచర్ ఇస్తాను అని అధికారులు చెబితే వద్దూ నేనే కొనుకుంటాని చెప్పానన్నారు. తన వైపు నుండి అవినీతి అనేది ఉండదని మాట ఇస్తున్నానన్నారు. పంచాయతీరాజ్ శాఖలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఉండాలని ఆదేశించారు. కేంద్రంలో నిధులు ఉన్నా ఎందుకు అడగలేదో అర్థం కాలేదన్నారు. చేపల చెరువులు ఉన్న చోట నీళ్లు లేవు, గోదావరి చుట్టూ ఉన్నా తాగడానికి నీళ్లు ఉండడం లేదని అన్నారు. ఇది గతపాలకుల పరిపాలనా లోపం అని ఎత్తి చూపారు. స్కిల్ డెవలప్మెంట్ జరగాలి.. ఏ యువతలో ఏ టేలెంట్ ఉందో ఎవరికీ తెలీయదు.. వాటిని వెలికి తీసేందుకు కృషి చేస్తామన్నారు.ఒక్కో విభాగం తవ్వే కొద్దీ లోపలికి వెళ్తూనే ఉంది. ఇవన్నీ సరిచేయాలి. శాఖ అప్పుల్లో ఉన్నప్పుడు నాలాంటి వాడు జీతం తీసుకోవడం చాలా తప్పు అనిపించింది. అందుకే జీతం వదిలేస్తున్నాను అని చెప్పా. దేశం కోసం నేల కోసం పని చేస్తా' అని స్పష్టం చేశారు.



RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# 292 కోట్ల మొక్కలు రూ. 12 వేల కోట్లు

▶▶ **మొదటిపేజీ తరువాయి**

కమిటీ వేయాలని భావిస్తోంది. అంతకుముందే గత ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేతల గ్రామాలు, ప్రాతినిథ్యం వహించినన నియోజకవర్గాల్లో పథకం అమలు తీరుపై అధ్యయనం చేయాలని సర్కార్ నిర్ణయించినట్లు తెలుస్తోంది.కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావ్ లాంటి కీలక నేతల నియోజకవర్గాలు, వాటి పరిధిలోని గ్రామాలలో నర్సరీలు నెలకొల్పేందుకు చేసిన ఖర్చు, నాటిన మొక్కలు, ప్రస్తుత పరిస్థితిపై వాస్తవాలు తేల్చాలని ఆదేశించారు. ఆయా పంచాయతీల పరిధిలో నాటిన మొక్కలెన్ని, ప్రస్తుతం ఉన్నవి ఎన్ని అనేది తెలియాలని అన్నట్లు సమాచారం. ఈ విషయంలో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని తన కార్యదర్శిని ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి హరిత హారం పథకం విషయంలో కమిటీ వేసేందుకు నిర్ణయం తీసుకోలేదని, ప్రాథమికంగా కొన్ని గ్రామాల్లో అధ్యయనం చేసి, అందులో తేలిన అంశాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితిపై కమిటీ వేయడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వ వర్గాల సమాచారం.

# మహిళలకు స్మార్ట్ కార్డులు

▶▶ **మొదటిపేజీ తరువాయి**

దుబాటులోకి తీసుకొస్తారు. ఇప్పటి వరకు వివిధ వర్గాలకు అందజేస్తున్న బస్ పాస్ మాదిరిగానే ఈ మహాలక్ష్మి పథకం కార్డులు కూడా జారీ చేస్తారు. వీటిని కూడా మరింత స్మార్ట్‌గా మార్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇకపై అన్ని బస్‌పాస్‌లు కూడా స్మార్ట్‌గా మార్చేయనున్నారు. ఉచిత ప్రయాణ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు ఇవ్వడంతోపాటు చిల్లర సమ్యలను అధిగమించేందుకు డిజిటల్ పేమెంట్స్ సిస్టమ్ ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని బండ్లగూడ డిపోలోని కొన్ని బస్సుల్లో ఈ విధానం విజయవంతంగా అమలు అవుతుంది. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని చూస్తున్నారు అధికారులుడిజిటల్ పేమెంట్ కోసం ఇంటెలిజెంట్ టికెట్ ఇష్యూ మిషన్ పేరుతో ఐటిమ్స్‌ను ప్రవేశ పెట్టింది. బండ్లగూడలోని బస్సులతోపాటు సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో దీన్ని మూడు నెలలుగా అమలు చేస్తున్నారు. అక్కడ ప్రయోగం విజయవంతం కావడంతోపాటు వేరే సమస్యలు రాకపోవడం, చిల్లర బాధలు కూడా తీరడంతో తెలంగాణ వ్యాప్తంగా దీన్ని ప్రవేశ పెట్టాలని భావిస్తున్నారు. డిజిటల్ పేమెంట్స్ ప్రవేశ పెట్టాలని ఆలోచనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ 10.97 కోట్ల రూపాయలతో 13వేల ఐటిమ్స్‌ను కొనుగోలు చేసింది. దీని ప్రకారం ప్రయాణికుడి వద్ద నగదు లేకపోయినా కార్డు, ఫోన్‌పే, గూగుల్ పే లాంటి పేమెంట్స్ యాప్స్ ఉంటే చాలు. వాటి ద్వారా డబ్బులు చెల్లించి టికెట్ తీసుకునే వెసులుబాటు ఇకపై ఆర్టీసీ బస్సుల్లో రానుంది.వివిధ రాష్ట్రాల్లో అమలు అవుతున్న ఐటిమ్స్ పనితీరు అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర అంశాలను తెలంగాణ ఆర్టీ అధికారులు పరిశీలించారు. బిహార్, ముంబై లాంటి ప్రాంతాల్లో విజయవంతంగా ఈ వ్యవస్థ అమలు అవుతుందని తేల్చారు. ఇక్కడ కూడా అమలు చేసే ఉద్దేశంతో పైలట్ ప్రాజెక్టు కింద కొన్ని బస్సుల్లో అమలు చేశారు. అక్కడ కూడా విజయవంతం కావడంతో ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. జులై ఆఖరిలో లేదా ఆగస్టు మొదటి వారంలో ఈ డిజిటల్ పేమెంట్స్ సిస్టమ్ తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ప్రారంభంకానుంది. మొదటిసారిగా పదివేల బస్సుల్లో ఈ ఐటిమ్స్ వ్యవస్థను అమలు చేయనున్నారు. అదే టైంలో మహిళలకు మహాలక్ష్మి కార్డులు కూడా ఇవ్వనున్నారు.



# పూడికలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు

**మహబూబ్ నగర్ - ప్రభాత సూర్యుడు**

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ పూడికతో నిండుకుంటోంది. ప్రతీ ఏడాది ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా ప్రాజెక్టులో పూడిక పేరుకపోతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. దీంతో జూరాలపై ఆధారపడిన ఉమ్మడి జిల్లాకు త్రాగు, సాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జూరాల ప్రాజెక్ట్?లో పూడిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు శాపంగా మారుతోంది. జలాశయం ప్రధాన క్రస్ట్ గేట్ల దిగువన స్లూయిజ్‌లు లేకపోవడంతో ప్రతీ సంవత్సరం పూడిక పేరుకుపోతోంది. దీంతో జలాశయంలో నీటి నిల్వ సామర్థ్యంపై ఈ భారం పడుతోంది. ఈ కారణంగా నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో అటూ త్రాగు, ఇటు సాగునీటి అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చలేకపోతోంది ఈ జలప్రదాయని.1995లో ప్రారంభమైన జూరాల జలాశయం వాస్తవంగా గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 11.94 టీఎంసీలు. పూడిక కారణంగా డ్యాంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని 2013లో 9.657టీఎంసీలకు సాగునీటి శాఖ అధికారులు తగ్గించారు. దీని కారణంగా జలశయంలో నీటి నిల్వ 2.283టీఎంసీల మేర తగ్గిపోయింది. నీటి నిల్వకు డ్యాంలో లోటు ఏర్పడడంతో పాటు వరదలు వచ్చే సమయంలో జలాల ఎత్తిపోతలకు కూడా ఇబ్బందులు ఎదరవుతున్నాయి. ప్రస్తుతం జూరాలలో మరోసారి పెద్ద ఎత్తున పూడిక పేరుకుపోయింది. ఎగువన నుంచి వస్తున్న వరదల కారణంగా ప్రాజెకట్ లో ప్రతి ఏడాది పూడిక వచ్చి చేరుతోంది. మరోసారి ప్రాజెక్ట్?లో పూడికపై అధికారులు సమీక్ష చేస్తే మళ్లీ నీటినిల్వ సామర్థ్యం తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ప్రాజెక్ట్?లో సుమారు 2 టీఎంసీలకుపైగా సామర్థ్యం తగ్గగా మళ్లీ మరో 2`3టీఎంసీల నీటినిల్వ తగ్గిస్తే త్రాగు, సాగు అవసరాలపై పెను ప్రభావం పడనుంది.నీటి పారుదల శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఒక టీఎంసీ నీటినిల్వతో ఒక పంటకు పదివేల ఎకరాలకు సాగునీటిని అందించవచ్చు. దీంతో ప్రతి పదేళ్లకు ఒకసారి పూడిక సమస్య కారణంగా గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం తగ్గించాల్సి వస్తే రానున్న రోజుల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన ఎత్తిపోతల పథకాలకు, తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తప్పేలా లేవు. గతేడాది ఏకంగా జూరాల ఆయకట్టు సాగుకు రబీలో క్రాప్ హాలీడ్ ప్రకటించాల్సిన దుస్థితి వచ్చింది. దీంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. సాగు, తాగు నీటి అవసరాలను తీర్చుతున్న ఇంత పెద్ద జలాశయం మనుగడకు పూడిక ముప్పు కాకుండా ఉండాలంటే ప్రభుత్వం ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలు

▶▶ **మొదటిపేజీ తరువాయి**

లేదా మరణశిక్ష విధించే అవకాశం ఉంటుంది. 511 సెక్షన్ల స్థానంలో 358 సెక్షన్లు మాత్రమే ఉండేలా రూపొందించారు. అంతేకాకుండా 18 సెక్షన్లు రద్దు చేశారు. అలాగే సాక్ష్యాలను జాతీయస్థాయిలో ఏర్పాటు చేసిన డిజీలాకర్‌లో ఉంచనున్నారు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్‌తో దేశవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లను అనుసంధానం చేశారు. సాక్ష్యాలను ఆన్‌లైన్‌లో పంపే అవకాశం ఉండనుంది. పెళ్లి చేసుకుంటానంటూ తప్పుడు వాగ్దానాలు ఇచ్చి లైంగిక సంబంధాలు పెట్టుకుని మహిళలను మోసం చేసేవారికి కఠిన నిబంధనలు ఉండనున్నాయి. కొత్త చట్టాల ప్రకారం మహిళలపై నేరాలకు బాధితులు కేసు పురోగతిపై 90 రోజులలోపు అప్‌డేట్ పొందేందుకు వీలు ఉంటుంది. క్రిమినల్ కేసుల విచారణలో ఆలస్యం తగ్గించేందుకు కోర్టులు గరిష్ఠంగా 2 వాయిదాలు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఆర్థిక నేరాల్లో నిందితుల ఆస్తులు, స్థిర, చరాస్తులను సీజ్ చేసే అధికారం పోలీసులకు కల్పించనున్నారు.

**ఇక జీరో ఎఫ్ఐఆర్**

జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు, ఎస్ఎమ్మెఎస్




ద్వారా సమన్లు జారీ వంటి అత్యాధునిక పద్ధతులను కొత్త చట్టాల్లో చేర్చారు. ప్రజలకు న్యాయం చేయడమే ఏకైక ధ్యేయంగా కొత్త చట్టాలు రూపుదిద్దుకున్నాయి. భారతీయత ఉట్టిపడేలా కొత్త చట్టాలకు రూపకల్పన చేశారు. కాలం చెల్లిన బ్రిటిషన్ వలస పాలన చట్టాలను వదిలి నేటి నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయి. త్వరలోనే భారత శిక్షా స్మృతి, నేర శిక్షాస్మృతి, సాక్షాధార చట్టాలను కనుమరుగు కానున్నాయి. వాటి స్థానంలో భారత పార్లమెంట్ ఆమోదించిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ చట్టాలు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి....భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా...ఇప్పటికీ బ్రిటీష్ ప్రభుత్వం వాసనలు ఇంకా పోలేదు. దేశంలో ఇప్పటికీ బ్రిటీష్‌వారు రూపొందించిన చట్టాలు, శిక్షలు అమలు చేస్తున్నారు. అప్పటి పరిస్థితులకు తగ్గట్లుగా వారికి అనుకూలంగా ఉండే విధంగా ఈ చట్టాలను రూపొందించారు. వలస పాలన నుంచి విముక్తి లభించినా...ఇప్పటికీ భారతీయులకు ఈ చట్టాల నుంచి విముక్తి లభించలేదు. వీటికి చరమ గీతం పాడేందుకు గత ప్రభుత్వం హయాంలో మోడీ సర్కార్ కొత్తచట్టాలను రూపొందించగా....పార్లమెంట్ ఆమోదించింది. ఇప్పటిక వరకు కొనసాగుతున్న ఐపీసీ, సీఆర్‌పీసీ, భారత సాక్ష్యాధార చట్టాలు కనుమరుగుకానున్నాయి. వాటి స్థానంలో పార్లమెంట్ ఆమోదించిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ చట్టాలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి.





# చందా దేవో దందా ఖరో

◇ **మోడీ సర్కార్ నినాదంగా మారింది**
◇ **ఎఐసిసి ప్రెసిడెంట్, ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే చురకలు**

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు**

ప్రధాని నరేంద్ర మోడీ ఒకప్పుడు పొత్తులను అపహాస్యం చేశారని, ఇప్పుడు అదే పొత్తులపైనే ఆధారపడ్డారని ఎఐసిసి ప్రెసిడెంట్, ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే చురకలంటించారు. రాజ్యసభలో ప్రెసిడెంట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ఖర్గే మాట్లాడారు. మోడీ సినిమాలో అన్ని లీకేజీలే ఉన్నాయని, నీట్ యూజీ లీక్ చేశారని, నీట్ పిజి రద్దు చేశారని, అయోధ్య రామాలయం పైకప్పు నుంచి వర్షపు నీరు లీక్ అయ్యిందని దుయ్యబట్టారు. ఏటా 20 లక్షల ఉద్యోగాల మాట హామీ ఏమైందని, మోడీ ఎన్నికల ప్రచారంలో అబద్ధాలు చెప్పడంతో పాటు కుల, మత, భాషా పరంగా ప్రజలను రెచ్చగొట్టారని ధ్వజమెత్తారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు 200కు పైగా ప్రసంగాలు ఇచ్చారని, మోడీ 117 ఎన్నికల ప్రచార సభలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, కానీ ఇసి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల ముందు విపక్షాల అకౌంట్లు ఫ్రీజ్ చేశారని, విపక్షాల ప్రచారాన్ని ఎన్నో రకాలుగా అడ్డుకున్నారని, విపక్షాలను అణగదొక్కడం మోడీకి అలవాటుగా మారిందని ఖర్గే మండిపడ్డారు. చందా దేవో దందా ఖరో మోడీ సర్కార్ నినాదంగా మారిందని, ఇడి, సిబిఐ, ఐటిని ఇష్టం వచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం వాడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వాలు పడగొట్టడం నేతలను కొనడం కామన్‌గా మారిందని, ప్రభుత్వాలను పడగొట్టడం ప్రజాస్వామ్యానికి అవమానం కాదా? అని ప్రశ్నించారు. మహారాష్ట్ర, గోవా, మణిపూర్‌లలో ప్రభుత్వాలను పడగొట్టారని, ఢల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని, కేజ్రీవాల్‌కు ఒక కేసులో బెయిల్ వస్తే మరో కేసులో అరెస్ట్ చేశారని, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు.




# గ్రేటర్‌లో విలీనమైన కంటోన్మెంట్ బోర్డు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

ఎట్టకేలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ వాసుల కోరిక నెరవేరింది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిల్ ఏరియాను జీహెచ్ఎంపీలో విలీనం చేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన విధి విధానాలకు సంబంధించి తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. వీటి ప్రకారం పౌర ప్రాంతాలను విలీనం అవుతాయి. ప్రజలకు సంబంధించిన మౌలిక సదుపాయాలన్నీ జీహెచ్ఎంసీకి బదిలీ అవుతాయి. మిలటరీ స్టేషన్ మినహా కంటోన్మెంట్‌లోని నివాస ప్రాంతాలకు జీహెచ్ఎంసీ పరిధి విస్తరించనుంది. దీని ప్రకారం కేంద్ర ప్రభుత్వం పేరిట హక్కుగావున్న భూములు, ఆస్తులు కేంద్రానికే దక్కనున్నాయి. ఆయా ప్రాంతాలను విభజించేటప్పుడు బలగాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విలీనం ప్రక్రియను పూర్తి చేయాలని రక్షణశాఖ అదనపు డైరెక్టర్ జనరల్ హేమంత్ యాదవ్ ఈనెల 28న బోర్డు సీఈవోకు ఉత్తర్వులు జారీ చేశారు.కేంద్రం ఉత్తర్వులు ప్రకారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని దాదాపు 2,670 ఎకరాల భూమి జీహెచ్ఎంసీకి బదిలీ కానుంది. అందులో 350 రెసిడెన్షియల్ కాలనీలు, 16 బజార్లు, 414 ఎకరాల కేంద్ర ప్రభుత్వ భూమి, 501 ఎకరాల లీజుకు తీసుకున్నవి ఉన్నాయి. ప్రస్తుతం 260 ఎకరాల ఖాళీ భూములున్నాయి. బ్రిటీష్ కాలం నుంచి ఇప్పటివరకు కొనసాగుతున్న కంటోన్మెంట్ బోర్డులన్నింటినీ రద్దు చేసి మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇటీవలే కేంద్ర రక్షణ శాఖకు లేఖ రాశారు. ఈనెల 25 కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లోనూ విలీన ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం కేంద్ర రక్షణ శాఖ అందుకు సంబంధించిన విధి విధానాలపై లేఖ రాశారు. దీని ప్రకారం కంటోన్మెంట్ లోని సివిల్ ఏరియాలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తారు. అక్కడి ప్రజలకు నిర్దేశించిన సౌకర్యాలు, మౌలిక వసతులన్నీ ఉచితంగా జీహెచ్ఎంసీకి బదిలీ చేస్తారు. కంటోన్మెంట్ బోర్డుల ఆస్తులు, అప్పులన్నీ మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. అక్కడ ఇప్పటికే లీజులు ఇచ్చినవి కూడా మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. మిలిటరీ స్టేషన్ మినహా కంటోన్మెంట్‌లోని నివాస ప్రాంతాలకు జీహెచ్ఎంసీ పరిధి విస్తరిస్తుంది. తన పరిధిలో ఉన్న వాటిపై పన్నులను విధిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పేరిట హక్కుగా ఉన్న భూములు, ఆస్తులు కేంద్రానికే దక్కుతాయి. ఈ ప్రాంతాలను విభజించేటప్పుడు, సాయుధ దళాల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. కేంద్రం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంటోన్మెంట్ బోర్డు బాధ్యులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి, తదుపరి కార్యాచరణ చేపట్టాలని సూచించింది. ప్రజల నుంచి అభ్యంతరాలు తీసుకునేందుకు ఎనిమిది వారాల వ్యవధి ఉంటుంది. దీనికి సంబంధించిన కమిటీ రిపోర్టు ఇచ్చాక తుది నిర్ణయం తీసుకుంటామని కంటోన్మెంట్ అధికారులు చెబుతున్నమాట. కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేయని ప్రయత్నం లేదు. ఢల్లీవెళ్లిన ప్రతీసారి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తో పలుమార్లు భేటీ అయ్యారు. మార్చి ఐదున తెలంగాణకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీని కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.



# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ?

◇ **కర్నాటక సీఎం సిద్ధరామయ్యను మార్చేందుకు కాంగ్రెస్ కసరత్తు**
◇ **పార్టీ హైకమాండ్ నిర్ణయానికి తమంత కట్టుబడి ఉంటాం**
◇ **సీఎం సిద్ధరామయ్య**

**న్యూ డిల్లీ - ప్రభాత సూర్యుడు**

కర్నాటక సీఎం సిద్ధరామయ్యను మార్చాలని కాంగ్రెస్ హైకమాండ్ యోచిస్తోందనే వార్తలు గుప్పుమంటున్నాయి. సీఎం రేసులో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పేరు వినిపిస్తుండటంతో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. నాయకత్వ మార్పు విషయంపై కర్నాటక కాంగ్రెస్‌లో జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి.సిద్ధరామయ్యను పక్కకుపెట్టి డీకే శివకుమార్‌కు పాలనా పగ్గాలు అప్పగిస్తారని హైకమాండ్ సైతం ఈ దిశగా కసరత్తు సాగిస్తున్నదని కాంగ్రెస్ వర్గాల్లో హాట్ డిబేట్ సాగుతోంది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ల సమక్షంలో ఇటీవల ఓ స్వామిజీ డీకేను సీఎం పీఠంపై కూర్చోబెట్టాలని వ్యాఖ్యానించడం కలకలం రేపింది. ఇక సీఎం మార్పు వార్తలపై సిద్ధరామయ్యను సోమవారం మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయం ప్రజల మధ్య చర్చించాల్సిన వ్యవహారం కాదని పేర్కొన్నారు. పార్టీ హైకమాండ్ తీసుకునే నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. సీఎం మార్పు వ్యవహారంపై సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు నాయకత్వ మార్పు ఊహాగానాలు మరింత జోరుగా సాగేలా చేశాయని భావిస్తున్నారు. సీఎంను మార్చుతారనే వ్యాఖ్యలను ఆయన ఖండిరచకపోవడంపై హాట్ డిబేట్ సాగుతోంది. దీంతో సీఎం సిద్ధరామయ్యపై వేటు తప్పదా అని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జోరందుకుంది.

# ఇక ఆన్ లైన్ లో నీట్ ఎగ్జామ్

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా అలజడి కొనసాగుతున్న వేళ ఎగ్జామ్‌ని రీషెడ్యూల్ చేస్తారన్న వార్త వినిపిస్తోంది. అందుకు సంబంధించి ఇప్పటికే కసరత్తు చేస్తోంది. త్వరలోనే దీనిపై ఓ ప్రకటన చేసే అవకాశముంది. అయితే...నీట్ పరీక్షను ఈ సారి ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇలా చేయడం ద్వారా పేపర్ లీక్‌లను అడ్డుకోవచ్చని యోచిస్తోంది. ఈ ప్రతిపాదనను కొంత మంది నిపుణులు కూడా సమర్థించారు. ఇలాంటి కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌ని ఆన్‌లైన్‌లో నిర్వహించడమే మంచిదని సూచించారు. ఎగ్జామ్స్ నిర్వహించే బాధ్యత నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీదే. అయితే..ఈ సారి పెద్ద ఎత్తున మాల్‌ప్రాక్టీస్‌తో పాటు పేపర్ లీక్ వ్యవహారం తెరపైకి రావడం సంచలనం సృష్టించింది. ఈ తరహా అవకతవకలు భవిష్యత్‌లోనూ జరిగే ప్రమాదముందని చాలా మంది వాదిస్తున్నారు. అందుకే..అసలు నీట్‌ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న వాళ్లూ ఉన్నారు. ముఖ్యంగా తమిళనాడు ప్రభుత్వం ఈ వాదనను గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే ఈ కేసుని విచారిస్తోంది. ఈ కేసుతో సంబంధం ఉన్న జర్నలిస్ట్‌ని అధికారులు అరెస్ట్ చేశారు. అటు పార్లమెంట్‌లోనూ నీట్ వ్యవహారం దుమారం రేపుతోంది. 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం ఏంటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. పూర్తిగా ఈ ఎగ్జామ్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఎంబీబీఎస్, బీడీఎస్ లాంటి యూజీ కోర్సులు చేసేందుకు లక్షలాది మంది విద్యార్థులు నీట్ ఎగ్జామ్ రాస్తారు. యూనివర్సిటీల్లో సీట్ రావాలంటే ఈ పరీక్ష తప్పనిసరిగా రాయాల్సిందే. 2017 నుంచి ఈ పరీక్షను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. అయితే..ఇప్పుడు పేపర్ లీక్ వ్యవహారంతో ఆన్‌లైన్‌లో జరపాలన్న చర్చ తెరపైకి వచ్చింది. ఈ పాటికే జరగాల్సి ఉన్న నీట్ వివాదం వల్ల వాయిదా పడిరది. జులై 25 27 మధ్యలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఇక పరీక్ష ఆగస్టు 21` సెప్టెంబర్ 8 మధ్య కాలంలో జరగనుంది. ఈ రెండు టెస్ట్‌లనూ ఆన్‌లైన్‌లోనే జరపనున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# జూలై 4న ఢిల్లీకి చంద్రబాబు

**విజయవాడ ప్రభాత సూర్యుడు** ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఖరారైంది. జూలై 4న ఢిల్లీకి వెళ్లనున్నారు. ప్రధాని మోదీతో పాటు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో భేటీ కానున్నారు. విభజన హామీలతో పాటు మరిన్ని ఆర్థిక అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. కేంద్ర బడ్జెట్ దృష్ట్యా రాష్ట్రానికి సంబంధించిన ప్రతిపాదనలపై కూడా సుదీర్ఘంగా చర్చించేందుకు వెళ్లనున్నట్లు సమాచారం. కేంద్రం ఆమోదించే బడ్జెట్లో ఏపీకి నిధులు గతంకంటే అధికంగా కేటాయించాలని విజ్ఞప్తి చేసేందుకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. విభజన హామీలను సత్వరం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులను కోరనున్నారు. దీంతో పాటు పెండిరగ్ బకాయిలు, రావల్సిన నిధుల విషయంలో కూడా కేంద్ర పెద్దలను ఒప్పించేందుకు భేటీ కానున్నారు. ఈ భేటీ తరువాత కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలపై ఒక స్పష్టత వస్తే రాష్ట్ర బడ్జెట్‌పై ముందుకు వెళ్లాలనే ఆలోచనలో సీఎం చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది. మోదీ ప్రమాణస్వీకారం తరువాత రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు సీఎం చంద్రబాబు తొలిసారి ఢిల్లీకి వెళ్లనున్నారు. దీంతో ఆయన టూర్‌పై అటు రాజకీయవర్గాల్లో, ఇటు ఏపీ ప్రజల్లో కూడా తీవ్ర ఆసక్తి నెలకొంది. ఏపీకి ప్రయోజనాల దృష్ట్యా ఎలాంటి ప్రకటన వెలువడనుంది, ఎన్ని నిధులు వస్తాయన్న చర్చ ఇప్పటి నుంచే మొదలైంది. ఇదిలా ఉంటే జూన్ 29న ఎన్డీయే కూటమిలో భాగస్వామ్యమైన బిహార్ సీఎం నితీష్ కుమార్ తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రత్యేక హోదా అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అదే విధంగా ఏపీ సీఎం ఢిల్లీ పర్యటన చేపట్టనున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ కు కూడా ప్రత్యేక హోదా ఇచ్చే అంశంపై చర్చిస్తారా అన్న కోణంలో కూడా ఒక వర్గం నుంచి చర్చ జరుగుతోంది. ఏది ఏమైనా చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి ఢిల్లీ పర్యటనపై తీవ్ర ఆసక్తి అయితే నెలకొంది. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక స్థితిపై ఓ అంచనాకు వచ్చిన చంద్రబాబు కేంద్ర సాయం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి మంగళవారం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీని నుంచి బయటపడేందుకు విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కొంత



నిధులు సర్దుబాటు చేస్తే వెసులుబాటు వస్తుందని కేంద్రంతో చర్చించనున్నారు. ముఖ్యంగా అమరావతి, పోలవరం ప్రాజెక్టులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రబాబు వాటిని ఈ టెర్మ్‌లోనే పూర్తి చేయాలని భావిస్తున్నారు. మరీ ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు, నిధుల అంశంపై మాట్లాడనున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టే నాటికి కేంద్రం నుంచి ఏదో రూపంలో నిధులు రాబట్టుకునేలా ఈ టూర్ ఉంటుందని అంటున్నారు. ఢిల్లీ టూర్‌లో చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీతో ,కేంద్రమంత్రులతో సమావేశం కానున్నారు. విభజన హామీల అమలుపై చర్చించనున్నారు. అదే టైంలో కేంద్ర బడ్జెట్‌లో కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేయనున్నారు. ఆ బడ్జెట్‌లో వచ్చిన నిధులు ఇతర అంశాలను ఆధారంగా చేసుకొని ఏపీలో బడ్జెట్ రూపొందించనున్నారు. సీఎం చంద్రబాబుతోపాటు మంత్రులంతా ఆయా శాఖల్లో ఉన్న నిధులు కొరతను చూసి నివ్వెరపోతున్నారు. డిప్యూటీ సీఎం అయితే తనకు జీతం వద్దని, ఆఫీస్ ఫర్నీచర్ కూడా ఇంటి నుంచే తెచ్చుకుంటానని ఛాంబర్‌లో మార్పులు కూడా అవసరం లేదని తేల్చేశారు. ఈ స్థాయిలో నిధుల కొరత ఉన్నప్పుడు అనవసరమైన ఖర్చు తగ్గించుకోవాలని మంత్రులు భావిస్తున్నారు. చంద్రబాబు కూడా పదే పదే ఇదే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులతో అద్భుతాలు చేయడం చాలా సంక్లిష్టతో కూడుకున్నదని అన్నారు చంద్రబాబు. అసలు ఆ నిధులు ఎక్కడ ఎలా ఖర్చు పెట్టారో కూడా తెలియడం లేదని ఇంకా లెక్కలన్నీ తీస్తున్నామని ప్రజలకు తెలిపారు. లోతుగా వెళ్తే తప్ప ఎంత డ్యామేజీ జరిగిందో గుర్తు పట్టలేమన్నారు. ఆ పనిలోనే అధికారులు మంత్రులు ఉన్నారని ఆ వివరాల వస్తే ఆర్థిక స్థితిగతులపై శ్వేత పత్రం విడుదల చేస్తామని అభిప్రాయపడ్డారు.



## మరోసారి తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర

న్యూ డిల్లీ - ప్రభాత సూర్యుడు
ధరల మోతతో ఇబ్బంది పడుతున్న గ్యాస్ వినియోగదారులకు దేశీయ చమురు సంస్థలు ఉపశమనం కలిగించాయి. మరోసారి తగ్గిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర.. తగ్గింది వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను తగ్గించాయి. 19 కేజీల సిలిండర్‌పై రూ.30 మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. తగ్గిన ధరలు ముంబై, కోల్‌కతా, చెన్నై సహా దేశవ్యాప్తంగా నేటి నుంచి అంటే జులై 1వ తేదీ నుంచే అమల్లోకి వస్తాయని వెల్లడిరచాయి.చమురు సంస్థల నిర్ణయంతో దేశ రాజధాని ఢల్లీలో రూ. 1,676గా ఉన్న వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ. 1,646కి తగ్గింది. అదేవిధంగా ముంబైలో రూ.1,629 నుంచి రూ.1,598కి తగ్గింది. ఇక చెన్నైలో రూ.1,840గా ఉన్న ధర ఇప్పుడు రూ.1,809కి పడిపోయింది. అదేవిధంగా కోల్‌కతాలో రూ.1,787 ఉన్న కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,756కి తగ్గింది. స్థానిక పన్నుల ఆధారంగా రాష్ట్రాలను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయి. కాగా, వరుసగా గత రెండు నెలల నుంచి కమర్షియల్ సిలిండర్ ధరలు తగ్గుతూ వస్తున్న విషయం తెలిసిందే. జూన్1న ఎల్‌పీజీ రేటు దాదాపు రూ.69 తగ్గగా, మే 1న సిలిండర్‌పై రూ.19 తగ్గింది. ఇక 14.2 కిలోల గృహ వినియోగ వంటగ్యాస్ ధరలు యథాతథంగా కొనసాగుతున్నాయి.

# సంపాదకీయం

## ఆశల పల్లకీలో కొత్త బడ్జెట్

మౌలిక సదుపాయాల రంగంపై బడ్జెట్‌లో కేటాయింపులు అంత ఎక్కువ కాకుండా నెమ్మదించాలని ఒత్తిడి ఉన్నప్పటికీ రైల్వే రంగం పై మాత్రం వచ్చే బడ్జెట్‌లో కేటాయింపులు ఎక్కువగా ఉండే అవకాశం కనిపిస్తోంది. కనీసం ఎలా లేదనుకున్నా ఆర్థికంగా ప్రభుత్వం చేయూత ఇవ్వక తప్పదు. దేశ జిడిపిలో 3.4% ప్రాతినిధ్యం వహిస్తున్న మౌలిక సదుపాయాల రంగానికి 202425 ఆర్థిక సంవత్సర మధ్యంతర బడ్జెట్‌లో రూ. 11.11 లక్షల కేటాయింపులు జరిగాయి. ఇప్పుడు పూర్తిస్థాయి బడ్జెట్‌లో కేటాయింపులు మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన స్థాయితో సమానంగా ఉండవచ్చు. ఆ కేటాయింపులు 2.6 ట్రిలియన్ కోట్ల రూపాయల వరకు ఉండవచ్చునని రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన ఒక అధికారి అంచనా ప్రకారం తెలుస్తోంది. ఫిబ్రవరిలో 202425 మధ్యంతర బడ్జెట్ సమర్పించినప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మౌలిక సదుపాయాల కల్పనలో గణనీయమైన ప్రగతిని సాధించినట్టు ప్రకటించారు. రైల్వేస్‌కు అదనపు బడ్జెట్ వనరులు రూ. 10,000 కోట్లు కాకుండా గ్రాస్ బడ్జెట్ సపోర్టు (జిబిఎస్)గా రూ. 2,52,200 కోట్లు నిధులు కల్పించారు. 202223 ఆర్థిక సంవత్సరంలో రూ.1.37 లక్షల కోట్ల స్థూల బడ్జెట్ మద్దతు ఉండగా, అంతకు ముందటి సంవత్సరం అనుసరించిన బడ్జెట్ ట్రెండే కొనసాగింది. ఈ కేటాయింపు 201314 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన మొత్తం కంటే తొమ్మిది రెట్లు ఎక్కువని సీతారామన్ ప్రకటించారు.ఇప్పుడు ఫిబ్రవరి నాటి మధ్యంతర బడ్జెట్‌లో కొన్ని రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రైల్వే కారిడార్లు, పిఎం గతిశక్తి పథకం కింద మూడు ప్రధాన రైల్వే కారిడార్లు గుర్తించారు. ఇవన్నీ లాజిస్టిక్ సామర్థ్యాన్ని మెరుగుపర్చడం, ఖర్చులను తగ్గించడం తదితర లక్ష్యాలతో కూడుకున్నాయి.కారిడార్లలో ఎనర్జీ, మినరల్, సిమెంట్ కారిడార్లు, పోర్టు కనెక్టివిటీ కారిడార్లు, హైట్రాఫిక్ డెన్సిటీ కారిడార్లు, రైల్వే అప్‌గ్రేడ్లు ఉన్నాయి. రైల్వే వ్యవస్థను ఆధునీకరించే క్రమంలో 40 వేల సాధారణ రైలు బోగీలను వందేభారత్ ప్రమాణాలతో మార్పు చేయనున్నారు. రాబోయే 25 సంవత్సరాలలో లక్ష కిలో మీటర్ల ట్రాక్‌ను వేయాల్సిన అవసరం ఉందని అంచనా. మరిన్ని సరకుల తరలింపు రోడ్ల నుండి రైల్వేలకు మారే అవకాశం కనిపిస్తోంది. 15 సంవత్సరాలలో 7000 నుంచి 8000 కొత్త రైలు సెట్‌లను కొనుగోలు చేయడానికి రూ. లక్ష కోట్ల ప్రణాళికను ప్రతిపాదించారు. ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్ సమర్పిస్తారు కాబట్టి ఈ మేరకు మౌలిక సదుపాయాల రంగానికి ఆర్థిక ప్రోత్సాహం కొనసాగిస్తారన్న ఆశలు కనిపిస్తున్నాయి. మధ్యంతర బడ్జెట్‌లో రోడ్లు, జాతీయ రహదార్ల నిర్మాణానికి రూ. 2.78 ట్రిలియన్ కోట్లు కేటాయించారు. ఈ నిధులు వ్యయం దాదాపు పూర్తి కావస్తోంది. తరువాత భారీ కేటాయింపులు రైల్వేకు అవసరమవుతాయి. రైల్వేలపై ఖర్చు చేయడంలో మాంద్యం పనికి రాదు. ఎందుకంటే రవాణా ఖర్చును జిడిపి శాతం ప్రకారం తగ్గించాలన్న లక్ష్యం నెరవేర్చక తప్పదు. రైల్వే మౌలిక సదుపాయాలకు సంబంధించి వ్యాగన్లు, కోచ్‌లు, సిగ్నలింగ్, కొత్త లైన్లు, గేజ్ మార్పిడి, హైస్పీడ్ రైళ్లు ఈ విధంగా ప్రతి విభాగానికి భారీగా పెట్టుబడి పెట్టవలసి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన ఘోర రైలు ప్రమాదం, కవచ్ ఆటోమేటిక్ రైలు భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ప్యాసింజర్ల భద్రత, సౌకర్యాలకే కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటోంది. మూలధన వ్యయం (కాపెక్స్) మాటల్లో చెప్పాలంటే జిబిఎస్ (గ్రాస్‌బడ్జెటరీ సపోర్టు) వాటా గత కొన్నేళ్లుగా పెరుగుతోంది. అదే సమయంలో అదనపు బడ్జెట్ వనరులు (ఇబిఆర్)బాగా తగ్గాయి. ఈ మేరకు ఐఆర్ఎఫ్‌సి, ఇనిస్టిట్యూషనల్ ఫైనాన్సింగ్, ఎఫ్‌డిఐ, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్స్ ఇవన్నీ ఇబిఆర్‌లో సమన్వయం కావలసి ఉంటుంది. ఇబిఆర్ దిశగా కేటాయింపులు చేయడమంటే పెట్టుబడులు పెట్టడంలో ప్రభుత్వం ఆలస్యం చేసే అవకాశం ఉంటుంది. బడ్జెట్ మద్దతుతో ఎక్కువ నిధులు వ్యయం చేయడానికి వీలవుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం కూడా సీరియస్‌గా నిధుల ఖర్చును పర్యవేక్షించ గలుగుతుంది. ఈ నేపథ్యంలో రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా రికార్డు స్థాయిలో రూ. 2.11 ట్రిలియన్ కోట్లు డివిడెండ్ రూపంలో ప్రభుత్వానికి సమకూర్చడానికి సిద్ధమవుతోంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం అత్యంత నైపుణ్యంగా వ్యయం చేయవలసి వస్తుంది. భారీ వినియోగానికి, ఉన్నతమైన పెట్టుబడి ప్రణాళికలకు మధ్య సమతూకం పాటించక తప్పదు. పూర్తి బడ్జెట్‌లో కేటాయించిన నిధులు కొంత వరకు ప్రైవేట్ పరంగా వినియోగించడానికి మళ్లిస్తారన్న భయాందోళనలు మొదట్లో తలెత్తాయి. ఫలితంగా రోడ్లు, రైల్వేలు వంటి రంగాలకు నిధుల వ్యయంలో కోత కనిపించేది. కానీ ఇప్పుడు ఆయా రంగాలకు నిధుల కేటాయింపునకు ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి.



## వలస బాటలో మరి కొంత మంది ఎమ్మెల్యేలు


**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు** తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు తిరుగులేని శక్తిగా చక్రం తిప్పిన బీఆర్ఎస్ ఓటమి తర్వాత పరిస్థితులు మారిపోతున్నాయి. పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్నారు. దీంతో బీఆర్ఎస్ పార్టీలో సంక్షోభం నెలకొనే పరిస్థితులు ఉన్నాయి.గడిచిన వారం రోజుల్లో ముగ్గురు ఃఖీ శాసనసభ్యులు పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. తాజాగా శుక్రవారం చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలిచిన కాలె యాదయ్య హస్తం కండువా కప్పుకున్న సంగతి తెలిసిందే. జూన్ 21వ తేదీన బాన్సువాడకు చెందిన రాష్ట్ర అసెంబ్లీ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆ రెండు రోజులకే జగిత్యాల నుంచి గెలిచిన డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ కూడా బీఆర్ఎస్ పార్టీని వీడి హస్తం గూటికి చేరారు. దీంతో కేవలం వారం రోజుల వ్యవధిలోనే ముగ్గురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీని వీడారు. గత నవంబర్ 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపాలైంది. కేవలం 39 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఇక ఇటీవలే జరిగిన లోక్ సభ ఎన్నికల్లో పూర్తిగా తేలిపోయింది. ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది.ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు. వీరిలో ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్, స్టేషన్ ఘణపూర్ నుండి కడియం శ్రీహరి, భద్రాచలం నుంచి గెలిచిన తెల్లం వెంకట్ రావు ఉన్నారు. తాజా ఫిరాయింపులతో కలిపి మొత్తం ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు? కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూలై రెండో వారంలో బడ్జెట్ సమావేశాలకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆ లోపే మరో ఎనిమిది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరే అవకాశం ఉందని ఆ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత చెప్పారు. పటాన్ చెరు నియోజకవర్గం నుంచి గెలిచిన గూడెం మహిపాల్ రెడ్డి హస్తం పార్టీ పెద్దలతో సంప్రదింపులు చేస్తున్నట్లు సదరు సీనియర్ నేత తెలిపారు. గత మూడు రోజులుగా ఆయన ఢిల్లీలోనే ఉన్నారని చర్చలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అయితే ఆయన చేరికకు సంబంధించి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేదని చెప్పుకొచ్చారు. ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుతో తెలంగాణ అసెంబ్లీలో అధికార కాంగ్రెస్ బలం 71కి చేరుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో 64 మంది ఎమ్మెల్యేలను గెలుచుకున్న ఆ పార్టీ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూడా గెలిచింది. రాబోయే నాలుగున్నరేళ్లలో ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు వాటిల్లొద్దని కాంగ్రెస్ భావిస్తోంది. ప్రభుత్వాన్ని సుస్థిరం చేసుకునేందుకు వీలైనంత ఎక్కువ మంది ఎమ్మెల్యేలను ఆకర్షించటమే లక్ష్యంగా పెట్టుకుంది. ఫిరాయింపుల నిరోధక చట్టంలోని నిబంధనలను వర్తించకుండా ఉండాలంటే కనీసం 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తీసుకోవాల్సి ఉంటుంది అని రాజకీయ విశ్లేషకుడు అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడాన్నిముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టిగా సమర్థించుకుంటున్నారు. ఆరు నెలల్లో మా ప్రభుత్వాన్ని కూల్చివేస్తానని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ చెప్పారు. భారతీయ జనతా పార్టీ నాయకులు మా పార్టీ ఎంతో కాలం నిలవదని అంటున్నారు. మేం ఎందుకు మౌనంగా ఉండాలి? మా ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలి కదా' అని మాట్లాడుతూ సమాధానమిచ్చారు. గత వారం ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన వెంటనే కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో మిగిలిన ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. భవిష్యత్తుపై భరోసా ఇస్తూ పార్టీలోనే ఉండాలని కోరారు. పోయినవాళ్ల గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఫిరాయింపులతో కలవరపడాల్సిన అవసరం లేదు. నిరుత్సాహపడాల్సిన అవసరం లేదు. ఇలాంటి నాయకులపై ఆందోళన విరమిద్దాం. ఈ ఫిరాయింపుదారుల స్థానంలో మంచి నాయకులను తయారు చేసే సత్తా పార్టీకి ఉంది.

### ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికే

# సంక్షేమం పథకాలు

**పెనుమాక పింఛన్ల పంపిణి లో సిఎం చంద్రబాబు నాయుడు**

**అమరావతి ప్రభాత సూర్యుడు** సంక్షేమం అనేది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు తొలి అడుగు పడిరదన్నారు. మంగళగిరి నియోజకవర్గం పెనుమాకలో పింఛన్లను సిఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అనంతరం మసీదు సెంటర్‌లో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్థులు, లబ్ధిదారులతో చంద్రబాబు ముచ్చటించారు. కొత్త ప్రభుత్వంలో తొలుత పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని, సమాజమే దేవాలయం? ప్రజలే దేవుళ్లు అని దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ అనే వారని గుర్తు చేశారు. ఎన్‌టిఆర్ స్ఫూర్తితో తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆంధ్ర ప్రజల ఆశీస్సులతోనే నాలుగో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశానని చెప్పారు. దివ్యాంగులకు ఆరు వేల రూపాయల పింఛన్లు పెంచామని, వారికి చేయూతనివ్వడం సామాజిక బాధ్యత అని బాబు తెలిపారు. పేదల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడంతో పాటు ఆర్థిక అసమానతలు లేని సమాజం చూడాలన్నదే తన కోరిక అని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి శక్తి వస్తే ప్రజలకు మరింత తిరిగి ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని, మాది ప్రజా ప్రభుత్వం అని, నిరంతరం ప్రజలకోసమే పని చేస్తానని, ప్రజలు నిండు మనస్సు ఆశీర్వదించి తమ ప్రభుత్వానికి సహకరించాలని బాబు విజ్ఞప్తి చేశారు.



# సిద్దిపేట సాగు నీటి కల సాకారం అయింది మీ హయాంలోనె

**- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట ప్రభాత సూర్యుడు** చరిత్ర లో నిలిచే పనులు ఎన్నో చేసిన ఘనత మీకె దక్కుతుంది. పదవులు శాశ్వతం కాదు. ప్రజా సేవ ఎల్లప్పుడూ ఉంటుందని చిన్నకూడూర్ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. హరీష్‌రావు మాట్లాడుతూ.. చిన్నకోడూరు మండల పరిషత్ చివరి సర్వ సభ్యసమావేశం జరుపుకుంటున్నాం. మీరందరూ గత 5 సంవత్సరాలుగా కష్టపడి ప్రజలకు మీ సేవలను అందించారు. సర్పంచ్ లు ఎంపీటీసీలు కలిసి చాల గ్రామాల్లో సమన్వయంతో పని చేశారు. కాళేశ్వరం నీళ్లను రైతులకు రెండు పంటలకు అందించిన గొప్ప అవకాశం మీ హయాంలో మీకు దొరికింది. ఎన్నో అభివృద్ధి పనులు చేస్తుంటాం. కానీ సాగునీరు మనకు జీవన ఆధారం. జీవన గతిని, పల్లెల ముఖ చిత్రాన్ని మార్చేది సాగు నీరు. అలాంటి సాగునీరు మీ ఈ అయిదేళ్ల కాలంలో రైతులకు అందడం మీ అదృష్టం. గ్రామాల్లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా కొన్ని పాఠశాలలు బాగుచేసుకున్నాం. అదేవిధంగా సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్ లు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు ఇలా అనేక అభివృద్ధి పనులు మీ హయాం లో చేసుకున్నాం. అభివృద్ధి అక్కడితో ఆగదు. ఎంత చేసుకున్నా ఎంతో కొంత మిగిలే ఉంటుంది. ఇంకా పనులు మిగిలే ఉంటాయి. పదవుల్లో ఉన్నపుడు ఎన్ని మంచి పనులు చేశామనేదే శాశ్వతంగా నిలిచిపోతుంది. కాబట్టి మీకు మళ్లీ ఇంకా మంచి అవకాశాలు రావలని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలవాలని కోరుకుంటున్నాను. పదవులు ఎవరికీ శాశ్వతం కాదు, ఎవరైనా మాజీలు కావాల్సిందే. అధికారంలో ఉన్నా లేకపోయినా నా సహకారం ఎప్పుడికి మీకు ఉంటుంది. ఇలాగే ఎప్పుడు మీరు ప్రజల్లో ఉంటూ, ప్రజా సంబంధాలను కొనసాగిస్తూ ఉన్నత పదవులు పొందాలని ఆశిస్తున్నానని అన్నారు.



### సీఎం చంద్రబాబు చేతుల మీదుగా

# తొలి పెన్షన్

**అమరావతి ప్రభాత సూర్యుడు** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని సీఎం చంద్రబాబు సోమవారం ఉదయం ప్రారంభించారు. మంగళగిరి నియోజకవ ర్గంలోని పెనుమాక గ్రామం లో రాములు నాయక్ అనే లబ్ధిదారులకు పెన్షన్ అందించారు. రాములు నాయక్ కూతురుకు పెన్షన్ అందించారు సీఎం చంద్రబాబు. దాదాపు అర గంటపాటు ఆ కుటుంబంతో ముచ్చటిం చిన సీఎం చంద్రబాబు వారి కష్టాలను అడిగి తెలుసుకు న్నారు. తమకు ఇళ్లు కావాలని కోరగా.. ఇళ్లు మంజూరు చేస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. మొత్తం 28 విభాగాలకు చెందిన లబ్ధిదారులకు పెంచిన పెన్షన్ అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 65.31 లక్షల మందికి పింఛన్ల పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి నెల నుంచే ఎన్నికల హామీల అమలుకు శ్రీకారం చుట్టింది. మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లు పెంచిన పెన్షన్‌ను తొలి నెల నుంచే అమలు చేస్తోంది ఏపీ సర్కార్. పెన్షన్ పెంచడంతో పాటు గడిచిన మూడు నెలలకు కూడా పెన్షన్ వర్తింపచేసింది ఏపీ ప్రభుత్వం. జులై మాసానిక పెరిగిన పింఛను 4000 కాగా.. ఏప్రిల్, మే, జూన్ నెలలకు వెయ్యి చొప్పున 3000 కలిపి మొత్తంగా 7000 రూపా యలు లబ్ధిదారులకు అందజేశారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్య కారులు, కళాకారులు, డప్పు కళాకారులు, ట్రాన్స్ జెండర్స్ వంటి వారికి ఇకపై రూ.4000 పెన్షన్ ఇవ్వనున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా

# మాజీ ఐఏఎస్ అధికారి కేఎస్ శ్రీనివాస రాజు

**హైదరాబాద్ ప్రభాత సూర్యుడు** తెలంగాణ ప్రభుత్వ సలహా దారుగా మాజీ ఐఏఎస్ అధికారి కేఎస్ శ్రీనివాస రాజు నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు. మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారుగా శ్రీనివాసరాజు నియామకం అయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థా నం జేఈవోగా సుదీర్ఘకాలం గా పనిచేసిన కేఎస్ శ్రీనివాస రాజు వీఆర్ఎస్ తీసుకున్న సంగతి తెలిసిందే. ఏపీ ఐఏఎస్ క్యాడర్‌లో 2001 బ్యాచ్‌కు చెందిన ఆయన 2011లో వైజాగ్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న సమ యంలో టీటీడీ జేఈ వోగా నియమితులయ్యా రు. ఏప్రిల్ 20వ తేదీన జేఈవో గా బాధ్యతలు తీసుకుని 2019 జూన్ వరకు ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ఎనిమిదేళ్ల రెండు నెలలపాటు పనిచేశారు. నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, చంద్రబాబు నాయుడు ప్రభుత్వాల్లో జేఈవోగా విధులు నిర్వహించి, టీటీడీలో తనదైన ముద్ర వేశారు.



# రేవంత్‌కు వ్యతిరేకంగా 38 మంది ఎమ్మెల్యేలు ?

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**వరంగల్ ప్రభాత సూర్యుడు** గతేడాది జరిగిన ఎన్నికల్లో విజయంతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. పార్టీలో సీనియర్లను కాదని, రేవంత్ రెడ్డిని అధిష్టానం సీఎం చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి రాజుకుందా?.. లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో పార్టీకి సీట్లు రాకపోవడమే దీనికి కారణమా అంటే ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ అవుననే చెబుతోంది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పనితీరుపై సొంతపార్టీకి చెందిన ఎమ్మెల్యేలల్లోనే విశ్వాసం తగ్గిందని.. ఆయన అనుసరిస్తున్న విధానాలపై పలువురు ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటనలో చోటు చేసుకున్న ఘటనే దీనికి నిదర్శనమని పెద్ది సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.వరంగల్ బీఆర్ఎస్ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన ..సీఎం రేవంత్ రెడ్డి ఒంటెద్దు పోకడలను సొంత పార్టీ ఎమ్మెల్యేలే వ్యతిరేకిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఆ పార్టీలోని మెజార్టీ ఎమ్మెల్యేలకు ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ పై సొంత పార్టీలోనే రోజురోజుకు అసమ్మతి గళం పెరుగుతుందని సుదర్శన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి పనితీరు పట్ల ఆయన పార్టీ ఎమ్మెల్యేల్లోనే సగం మందికి పైగా విశ్వాసం తగ్గిందని అన్నారు.



గెలిచిన 64 మందిలో కేవలం 26 మందే రేవంత్ రెడ్డి వైపు ఉన్నారంటూ కీలక వ్యాఖ్యలు చేశార.మిగతా 38 మంది ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డిని వ్యతిరేకిస్తున్నారని.. అందుకు నిదర్శనమే వరంగల్ లో ఎదురైన సంఘటన అని ఆయన తెలిపారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్‌బాబులకు మాత్రమే రేవంత్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. అంటే.. మిగిలిన మంత్రులపై రేవంత్ రెడ్డికి నమ్మకం లేదా అని ప్రశ్నించారు. కేబినెట్ మంత్రుల్లో ఈ ఇద్దరు మంత్రులు మాత్రమే ఆయన తీసుకుంటోన్న నిర్ణయాలను స్వాగతిస్తున్నారని పెద్దిరెడ్డి విమర్శించారు. తన సొంత పార్టీలోనే ధిక్కార స్వరం పెరిగి పోయిందని, అందుకే తన వర్గాన్ని పెంచుకోవడానికి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ కండువా కప్పుతున్నారంటూ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి పార్టీ ఫిరాయింపులపైనే పూర్తి దృష్టి కేటాయించారంటూ సుదర్శన్ రెడ్డి విమర్శించారు. ఈ కారణంగానే రాష్ట్రంలో క్రైం రేటు విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో గంటకో హత్య జరుగుతుందని సుదర్శన్ రెడ్డి ఆవేదన చెందారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందంటూ సుదర్శన్ రెడ్డి ఆరోపించారు.



# బీఆర్ఎస్‌కార్యాలయాన్ని కూల్చివేయండి

**- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**నల్గొండ ప్రభాత సూర్యుడు**
నల్లగొండ పట్టణం నడిబొడ్డున, అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలంలో నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ ఆకార్యాలయాన్ని తక్షణమే కూల్చేయాలంటూ మున్సిపల్ కమిషనర్ ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. పేదవాడు సొంత స్థలంలో ఇల్లు కట్టుకుంటే సవాలక్ష రూల్స్ రెగ్యులేషన్స్ పెడుతున్న మీరు.. 100 కోట్ల భూమిలో అనుమతి లేకుండా ఇంద్ర భవనం లాంటి పార్టీ ఆఫీస్ కడుతుంటే ఏం చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చామని కమిషనర్ సమాధానం చెప్పగా.. నిబంధనల ప్రకారం వ్యవహరించాలి తక్షణమే కూల్చేయాలని మంత్రి ఘాటుగా స్పందించారు. అలాగే.. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా అనుమతుల్లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ వ్యవహారాన్ని మానిటర్ చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కి సైతం సూచించారు.


# శ్రీరామ్ హీరోగా "కోడి బుర్ర"

## వీ4 క్రియేషన్స్ నిర్మాణంలో క్రైమ్ థ్రిల్లర్ మూవీ

## పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన సినిమా

**ఒకరికి ఒకరు, రోజాపూలు, స్నేహితులు, రాగల 24 గంటల్లో వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరో శ్రీరామ్ కొత్త మూవీ "కోడి బుర్ర" ఈ రోజు హైదరాబాద్ ఫిలింనగర్ దైవసన్నిధానంలో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని వీ4 క్రియేషన్స్ బ్యానర్ లో కంచర్ల సత్యనారాయణరెడ్డి, గట్టు విజయ్ గౌడ్, చిన్ని చందు, వట్టం రాఘవేంద్ర, సముద్రాల మహేశ్ గౌడ్ నిర్మిస్తున్నారు. చంద్రశేఖర్ కానూరి దర్శకత్వం వహిస్తున్నారు. శృతి మీనన్, ఆరుషి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. మహావీర్ మరో కీ రోల్ పోషిస్తున్నారు. కోడి బుర్ర సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో అతిథిలుగా పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ క్లాప్ నివ్వగా దర్శకుడు భరత్ కమ్మ స్క్రిప్ట్ అందజేశారు. అనంతరంఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. కోడి బుర్ర చిత్రాన్ని మా మిత్రులు నిర్మిస్తున్నారు.**

**మూవీ డెస్క్ ప్రభాత సూర్యుడు**
మంచి కథను ఈ సినిమా కోసం ఎంచుకున్నారు. ప్రేక్షకుల్ని ఈ మూవీ ఆకట్టుకుని ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాం. హీరో శ్రీరామ్, హీరోయిన్ శృతి మీనన్, నిర్మాతలైన నా మిత్రులకు, ఇతర సినిమా టీమ్ శుభాకాంక్షలు తెలియజేశారు. దర్శకుడు చంద్రశేఖర్ కానూరి మాట్లాడుతూ.. ఈ రోజు మా కోడి బుర్ర సినిమా ప్రారంభోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో శ్రీరామ్ గారిని కొత్తగా చూస్తారు. ఆయన ఇప్పటిదాకా లవ్, రొమాంటిక్ తరహా చిత్రాలు చేశారు. కోడి బుర్ర సినిమాలో పోలీస్ ఆఫీసర్ గా కనిపిస్తారు. హీరోయిన్ శృతి మీనన్ డాక్టర్ రోల్ చేస్తోంది. కోడి బుర్ర అందరికీ నచ్చేలా మంచి క్రైమ్ థ్రిల్లర్ సినిమా అవుతుందని నమ్ముతున్నాం అని అన్నారు. హీరో శ్రీరామ్ మాట్లాడుతూ.. కోడి బుర్ర సినిమా క్రైమ్ థ్రిల్లర్ కథతో మీ ముందుకు రాబోతోంది. ఈ సినిమా టైటిల్ వినగానే మీకు ఒక ఐడియా వచ్చి ఉంటుంది. వీ 4 క్రియేషన్స్ లో ఈ సినిమా చేయడం సంతోషంగా ఉంది.మా డైరెక్టర్ చంద్రశేఖర్ కు ఇది నాలుగో సినిమా. కోడి బుర్ర చిత్రాన్ని అందరికీ నచ్చేలా ఆసక్తికరంగా తెరకెక్కిస్తున్నారు. శృతి మీనన్ తమిళ, మలయాళ భాషల్లో సినిమాలు చేసింది. ఆరుషిమంచి రోల్ చేస్తోంది.ఒక ఇంట్రెస్టింగ్ మూవీలో పార్ట్ కావడం హ్యాపీగా ఉంది. మా ప్రొడ్యూసర్స్, డైరెక్టర్ కు థ్యాంక్స్ అన్నారు. హీరోయిన్ శృతి మీనన్ మాట్లాడుతూ.. నేను తమిళ, మలయాళంలో సినిమాలు చేశాను. కోడి బుర్ర చిత్రంతో తెలుగు లోకి అడుగుపెడుతున్నాను. తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రంతో పరిచయం కావడం సంతోషంగా ఉంది. కోడి బుర్ర సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్. అన్నారు. నిర్మాత గట్టు విజయ్ మాట్లాడుతూ.. కోడి బుర్ర సినిమాను ఇవాళ లాంఛనంగా ప్రారంభించుకున్నాం. ఈ నెల 22వ తేదీ నుంచి రెగ్యులర్ షూటింగ్ కు వెళ్తున్నాం. హీరో శ్రీరామ్ గారు ఈ కథ విన్న వెంటనే సింగిల్ సిట్టింగ్ లో ఓకే చేశారు. ఆయనకు థ్యాంక్స్ చెబుతున్నాం. అలాగే శృతి, ఆరుషి హీరోయిన్స్ కనిపించనున్నారు. ఒక మంచి మూవీతో మీ అందరి ముందుకు త్వరలోనే వస్తాం అన్నారు. నిర్మాత కంచర్ల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. నా ఫేవరేట్ హీరో శ్రీరామ్ గారితో సినిమా ప్రొడ్యూస్ చేస్తుండటం సంతోషంగా ఉంది. ఆయన ఒకరికి ఒకరు, పోలీస్ పోలీస్ సినిమాలను చాలా సార్లు చూశాను. ఈ చిత్రాన్ని నా మిత్రులు గట్టు విజయ్ గౌడ్, చిన్ని చందు, వట్టం రాఘవేంద్ర, సముద్రాల మహేశ్ గౌడ్ తో కలిసి ప్రొడ్యూస్ చేస్తున్నాను. పేరున్న నటీనటులు మా చిత్రంలో నటించబోతున్నారు. మంచి కథ, మా డైరెక్టర్ గారు ఎంతో క్రియేటివ్ గా సినిమా స్క్రిప్ట్ చేశారు. కోడి బుర్ర సినిమా సక్సెస్ అయ్యి మా బ్యానర్ కు మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాం. అన్నారు. హీరోయిన్ ఆరుషి మాట్లాడుతూ `కోడి బుర్ర చిత్రంలో నాకు నటించే అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్స్, డైరెక్టర్ కు థ్యాంక్స్. ఈ చిత్రం మా టీమ్ అందరికీ మంచి పేరు తెస్తుంది. మీ సపోర్ట్ అందిస్తారని కోరుకుంటున్నా అన్నారు. నటుడు మహావీర్ మాట్లాడుతూ నేను మా డైరెక్టర్ చంద్రశేఖర్ చేసిన గత మూవీ రవికుల రఘురామలో విలన్ గా నటించారు. కోడి బుర్ర చిత్రంలో కూడా నెగిటివ్ రోల్ చేస్తున్నాను. ఈ చిత్రానిక మీ అందరి సపోర్ట్ ఉంటుందని ఆశిస్తున్నాం . అన్నారు.






PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.783/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR501 505, RANGAREDDY DIST/ HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.783/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215